క్లుప్తంగా

ఆదర్శప్రాయుడు అబ్దుల్‌కలాం



నర్వ: శాస్త్ర సాంకేతికతలో యువతకు ఆదర్శ ప్రాయుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సర్పంచ్ సంధ్యా అన్నారు. ఆదివారం అబ్దులకలాం జయంతిని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రఫీ, అయ్యప్ప, శంకర్, హన్మంతురెడ్డి, ఖలీల్ అహ్మద్, ఫజల్, మౌలాలి, శంకర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మకండి

నారాయణపేట రూరల్: ఎన్నికల్లో గెలవడానికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజలను మభ్యపెడుతూ కొత్త స్కీంలను ప్రకటిస్తున్నాయని, మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు అమలు చేస్తున్న పథకాలకు ఎంతో మంది అర్హత ఉన్నా రేషన్‌కార్డులు లేక దూరమయ్యారని, వారికి మొదట న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

మక్తల్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ వాకిటి శ్రీహరికి రావాలని ఆదివారం పట్టణంలో పడమటి ఆజనేయస్వామికి కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. పార్టీకి 30 ఏళ్ల నుంచి సేవ చేస్తున్నారని, నియోజకవర్గంలో మంచి పట్టున్న నాయకుడని అన్నారు.రవికుమార్, గణేష్‌కుమార్, గోవర్ధన్, రవి, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టో మోసం

కోస్గి: ఎన్నికల సందర్భంగా గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే మరోమారు ఎన్నికల మేనిఫెస్టో పేరుతో బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి వంటి పథకాలతోపాటు మరెన్నో పథకాలను అమలు చేయకుండా కొత్త పథకాల పేరుతో ప్రజలను మరోమారు మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్ర ప్రజలు మోసపూరిత హామీలను నమ్మకుండా సంక్షేమ పాలన అందించే బీజేపీకి పట్టం కట్టాలన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

మక్తల్: పట్టణానికి చెందిన వాలీబాల్ క్రీడాకారిణి శివానిని ఆదివారం డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు శాలువతో సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిల్లో రాణించాలని సూచించారు. వాలీబాల్ అకాడమీకి ఎంపికైందన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి



కోయిల్‌కొండ: ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ముదిరాజ్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. నల్లవల్లి అధ్యక్షుడిగా బోయిని శ్రీనివాసులు, వీరంపల్లి అధ్యక్షుడి ఎస్.రవికుమార్, పారుపల్లి అధ్యక్షుడిగా కావాలి రవికుమార్, అభంగపట్నం అధ్యక్షుడిగా సి.రవికుమార్, శేర్‌పల్లి అధ్యక్షుడిగా ఆంజనేయులు తదితరులు ఎన్నికయ్యారు. నారాయణ, వెంకటేష్, జగన్, గోపాల్, పెంటయ్య, గోపి, రమేష్, ఆంజనేయులు, నర్సిములు, కిష్టయ్య, కేశవులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనూ బీజేపీదే అధికారం

ఆత్మకూర్: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని.. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని పార్టీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని బాలకిష్టాపూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని.. ప్రపంచ దేశాలన్నీ భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని.. ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు జలంధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ రేచింతల శ్రీను, జిల్లాకార్యదర్శి అశోక్‌కుమార్ జీ, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, గాడి శేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేట అంబాభవాని ఆలయంలో..



సింగారంలోని భవానిమాత ఆలయంలో...



అశోక్‌నగర్ మాలలాంభికదేవి..

బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు



కోస్గిలో అమ్మవారి ప్రత్యేక పూజల్లో భక్తులు



జిల్లా కేంద్రంలో పూజలు చేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శక్తిపీఠంతో పాటు మహంకాళి, చౌడేశ్వరి, అంబాభవాని, నగరేశ్వరాలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయంలో, సింగారం గిరిపీఠంపై వెలిసిన భవానిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కోటకొండలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆభరణాలు శోభాయాత్రగా కన్యకాపరమేశ్వరి ఆలయానికి తీసుకెళ్లారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

పట్టణంలోని సరాఫ్‌బజార్ బసవేశ్వర దేవాలయం, మడి శివాలయంలో ఎస్ఎస్‌కే సమాజ్, బాపూనగర్ ఎంవీఎం ఫ్రెండ్స్ బసవేశ్వర దేవాలయం, బారంకుంట్ల, బ్రాహ్మణ్‌వాడి, చౌక్‌బజార్‌లో శ్రీ ఫ్రెండ్స్, బహర్‌పేట, అంబేద్కర్ చౌరస్తాలో థండర్‌బాయ్స్, చౌడమ్మ దేవాలయంలో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు ప్రత్యేక వేషాధారణతో పట్టణ పురవీధుల గుండా మేళతాళాలు, భజనా సంకీర్తనలు, యువతుల కోలాటాలతో శోభాయాత్రగా మండపాలకు తరలించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు చేశారు.

ఊట్కూరు: మండల కేంద్రం, బిజ్వార్‌లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. బిజ్వార్‌లోని అంబర్‌త్రయక్షేత్రంలో ఆదిత్యపరాశ్రీ ఆధ్వర్యంలో దుర్గామాతా విగ్రహాన్ని శోభయాత్ర చేపట్టారు. శోభయాత్రలో యువకులు కోలాటం, చెక్క భజన తదితర సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



బిజ్వార్‌లో దుర్గామాత శోభాయాత్ర

కోస్గి: మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగాణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో వీరశైవ సమాజం, అక్క మహాదేవి మహిళ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మున్నూర్ వీధిలో యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలను చేపట్టారు.

మక్తల్: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ధ్వజారోహణ నిర్వహించారు. మాద్వార్‌లో బ్రహ్మంగారి దేవాలయం వద్ద దుర్గామాతకు ప్రత్యేకంగా పూజలు చేశారు.

బాలత్రిపుర సుందరీగా..

నర్వ: నవరాత్రి ఉత్సవాల భాగంగా మొదటిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీగా దర్శనిమిచ్చింది. అమ్మవారికి అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చన, అలంకరణ, మహామంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని పలు మండపాలలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మారుతీనగర్ కాలనీలోని ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. రజక సంఘం, బీసీకాలనీలో, గంగాదేవి ఆలయం, వీరభద్రేశ్వరస్వామి దేవాలయం, అంబాభవాని ఆలయం, దత్తాత్రేయ ఆలయంలోనూ బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరణ చేశారు.

రాజరాజేశ్వరిగా అమ్మవారు

మద్దూరు: మండలంలోని మద్దూరు, రెనివట్ల, తిమ్మారెడ్డిపల్లి, కొమ్మురు, పెదిరిపాడ్, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసినా మండపాల్లో దుర్గమాతను ప్రతిష్ఠించి దేవినవరాత్రుల పూజలు నిర్వహించారు. ఆదివారం మద్దూరు యువత ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినా మండపంలో పూజారి హన్మేష్‌చారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారికి సర్వకపచాలాంకృత దుర్గాదేవిగా భక్తులు పూజించారు. అనంతరం భక్తులకు అమ్మవారి ప్రసాదం అందజేశారు.



మద్దూరులో దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

బీఆర్ఎస్‌వి అమలుకాని హామీలే..

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన ఎన్నికల హామీలను 9 ఏళ్లు గడిచినా నేటికీ అమలు చేయలేదని.. కొత్త హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని బీఆర్ఎస్ మేనిఫెస్టోపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన రూ.లక్ష పంట రుణమాఫీ నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని.. వడ్డీకూడా మాఫీ చేస్తామని మాట తప్పారని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీలు అటకెక్కాయని తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానన్న మాట నిలబెట్టుకోలేక పోయారని.. నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారకులయ్యారన్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ప్రవళికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. రైతుబంధు మేనిఫెస్టోలో లేకున్నా అమలు చేశామని సీఎం గొప్పలు చెబుతున్నారని.. వ్యవసాయ ఉపకరణాలపై గత ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీని ఎత్తేసి రైతుబంధు ఇస్తున్నారని విమర్శించారు. పాలమూర్–రంగారెడ్డి ప్రాజెక్టు 9 ఏళ్లు దాటినా పూర్తి కాలేదని.. 34 పంపులకు నార్లాపూర్ వద్ద ఒక పంపును మాత్రమే ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని.. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, సహాయ కార్యదర్శి భాస్కర్, రవీందర్, రఘు, మల్లేష్, వెంకటేష్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నర్వ, పాథర్చేడ్ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

నర్వ: మండలంలోని ప్రధాన రహదారి జక్లేర్, అమరచింత రహదారిపై ఆదివారం ప్రత్యేక మొబైల్ టీం వాహనాల తనిఖీ చేపట్టింది. ఈ సందర్భంగా ఇటు అమరచింత, జక్లేర్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంలో ఎలాంటి నగదు దొరకలేదు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదుకు తప్పనిసరి రశీదులు ఉండాలన్నారు.

రేషన్‌షాపుల ఏర్పాటుకు వేడుకోలు



బైరంపల్లి పంచాయతీ ట్రాక్టర్‌లో బియ్యం తెచ్చుకుంటున్న గ్రామస్తులు

- కొత్త పంచాయతీల్లో కానరాని వైనం
- పక్క గ్రామాల రేషన్‌షాపుల నుంచి బియ్యం తెచ్చుకుంటున్న లబ్ధిదారులు

మాగనూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెలా ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకెళ్లేందుకు పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల్లో రేషన్ దుకాణాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఐదు నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ దుకాణాల నుంచి బియ్యం తమ ఇళ్లకు తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులే రూ.వంద వరకు అవుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

బైరంపల్లి, ఒబ్లాపూర్, పర్మన్‌దొడ్డి, నేరడగందొడ్డి, పుంజనూర్, పెగడబండ, అచ్చంపేట గ్రామాల్లో రేషన్ దుకాణాలు కరువయ్యాయి. బైరంపల్లిలో రేషన్ దుకాణం లేకపోవడంతో 5కిలో మీటర్ల దూరంలో ఉన్న ఉజ్జెలిలోని చౌకధర దుకాణం నుంచి సరుకులు తెచ్చుకుంటున్నారు. దీంతో రానుపోను ఖర్చులతో పాటు బియ్యం ఇంటికి తీసుకెళ్లేందుకు రూ.80 వరకు ఖర్చు చేస్తున్నారు. ఒబ్లాపూర్ కొత్త పంచాయతీగా ఏర్పడిన కూడా రేషన్ దుకాణం ఏర్పాటు చేయకపోవడంతో 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న సత్యారం వెళ్లి తెచ్చుకుంటుండటంతో దాదాపుగా ప్రతి నెల రవాణా చార్జీలకే రూ.50 నుంచి రూ. 100 వరకు ఖర్చు చేస్తున్నారు.

కొంత బియ్యం అమ్మి..

గ్రామీణ ప్రాంతంలో వర్షాధారిత పంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తారు. పేద ప్రజలు కావడంతో ప్రతి నెలా బియ్యం తరలించేందుకు ఆటో చార్జీ కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నారు. దీంతో కొంత రేషన్ బియ్యం కిరాణ దుకాణాల్లో విక్రయించి ఆటో చార్జీలు చెల్లిస్తున్నారు.

ప్రతి నెల రూ.80 ఖర్చు



ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యం ఇంటికి తెచ్చుకునేందుకు ప్రతి నెల రూ.80 ఆటో చార్జి అవుతుంది. మా గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో బియ్యం తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నాం. అధికారులు దృష్టి సారించి మా గ్రామంలో బియ్యం ఇవ్వాలి.

– తాయప్ప, బైరంపల్లి

చాలా కష్టమవుతుంది..



ప్రతి నెల మరో గ్రామానికి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే చాలా కష్టమవుతుంది. రేషన్ బియ్యం సరఫరా చేసే సమయంలో కొన్ని సార్లు పనులు ఉండటంతో వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షకాలం అయితే సరైన రహదారి లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కొత్త రేషన్ షాపులు మంజూరు చేయాలి.

– మంజుల, సర్పంచ్, బైరంపల్లి

సమస్య పరిష్కరిస్తాం..



మండలంలోని మారుమూల ప్రాంతాల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల నుంచి వచ్చిన వినతులు మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకోసారి నివేదికను పరిశీలించి సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో రేషన్ దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– సతీష్ కుమార్, తహసీల్దార్,

తీరిన తాగునీటి సమస్య



మాట్లాడుతున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో తాగునీటి సమస్య పూర్తిగా తీరిందని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం వర్కటం జగన్నాథ్‌రెడ్డి పల్లెపల్లెకు వీజేఆర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో కొన్నేళ్లుగా ఉన్న తాగునీటి సమస్యను సమీపంలోని పెద్ద వాగు నుంచి దాదాపుగా మూడు కిలోమీటర్ల మేర పైపులైన్ వేయించామన్నారు. రాబోవు ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు వర్కటంకు అని తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, రఘు, శాలం, గంప అంజప్ప, అంజనేయులు, నాగరాజు, సందీప్, హాజీబాబా, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కరాటేలో రాణించాలి



విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేస్తున్న ఏఎస్‌ఐ మన్నన్

మాగనూర్: విద్యార్థులు కరాటేలో రాణించాలని ఏఎస్ఐ మన్నన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాఠశాలలో డ్రాగన్ షోటోఖాన్ కరాటే–డూ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీలో 150 మంది విద్యార్థులు పాల్గొనగా, 40 మందికి ఎల్లో, 30 మంది బ్లూ, 20 మంది బ్లాక్ బెల్ట్ సాధించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ.. నేడు మహిళలు వారి రక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టులను అందజేశారు. మాస్టర్ సాలం, మధుసూదన్, ప్రిన్సిపాల్ మహేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



కొల్లంపల్లిలో అమ్మవారి విగ్రహంతో శోభాయాత్ర

నారాయణపేట రూరల్: పద్మశాలి కుల దైవమైన మద్దిలేశ్వరి మాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచబమ్యం, గ్రామ ప్రదిక్షణ, జలాదివాసం, ప్రధాన వేదిక ఆవాసనం, అంకురార్పణ, ధాన్యాదివాసం, పంచవిధి, శయనారోపణ చేపట్టారు. అదేవిధంగా పుణ్య దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు పెద్ద ఎత్తున హోమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం యంత్రస్థాపన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



మక్తల్‌లో బాణాసంచా కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మరికల్: నారాయణపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా రాజేందర్‌రెడ్డికి ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ బీఫాం అందజేయడంతో మండల నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్లను పంచుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, నాయకులు రవి, కృష్ణారెడ్డి, బసంత్, తిరుపతయ్య, రామస్వామి, గోవర్ధన్, రాజవర్ధన్ రెడ్డి, రాములు, రాజేష్, మోహన్, రాజేందర్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

మక్తల్: సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో ఆదివారం విడుదల చేయడంపై పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంలింగం, రవీందర్‌రెడ్డి, సలాం, శివారెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: బీఆర్ఎస్ టికెట్ పొంది ఆదివారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దండు అయ్యప్ప, గడ్డం నర్సింహులు, వెంకటేశ్వర్‌రావు, సర్పంచు శివన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో..



నర్వలో..

అసంపూర్తిగా డ్వాక్రా భవనం



పల్లెర్లలో అసంపూర్తిగా ఉన్న డ్వాక్రా భవనం



తిమ్మారెడ్డిపల్లిలో పంచాయతీ భవనం

మద్దూరు: నిధుల కొరత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మండలంలోని పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పల్లెర్లలో 19 ఏళ్ల క్రితం పనులు ప్రారంభించిన డ్వాక్రా మహిళా భవనం నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి ఇందిరా గ్రామీణ పథకం కింద రూ.3 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. నిధులు మంజూరు కాకపోవడంతో దాన్ని అసంపూర్తిగా వదిలేశారు. దాదాపు 10ఏళ్లకు పైగా గడుస్తున్న నేటికి అలాగే ఉంది. ఈ భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామాల ప్రజలకు కోరుతున్నారు.